


నరసింహారావుగారు, ఒకచేత్తో కాఫీ తాగుతో, ఒకచేత్తో సిగరెట్ కాలుస్తో, ఒక కంటితో నన్నుచూస్తో, ఒకకంటితో ఎదటిగోడను చూపుతో అడిగారు :

'ఆగోడమీద రాతలు చూశారా ?'

మేము అంతసేపూ మాటల్లో కాలాన్ని మరిచి కూర్చుండిపోయిన ఆహోటలు ఎదటిగోడమీద, మసిబొగ్గు అక్షరాలలో ఉంది :

'ఆలయం వీధిలో గేలం
జారిపడతారు జాగ్రత్త.'

ఏటేటా వెల్లవేసే గోడలమీద వానజల్లుకు చెరిగిపోయే మసిబొగ్గురాతల్లో ఏమంత చారిత్రక సత్యం దొరుకుతుంది ? వీధివీధికీ అచ్చుయంత్రం ఉన్న ఈ యుగంలో గోడమీదే మేలుకొలుపులు పాడాలా అని నేను అనుకొంటూ ఉండగానే, ఇంతలోకి ఆయన అందుకొన్నారు.

'గోడమీది రాతల్లో అబద్ధాలే ఉంటా యను కోడం ఎంత నిజమో, నిజాలే ఉంటా యను కోడం అంత అబద్ధం. ఆ రాతల్లో నమ్మకంగానీ అపనమ్మకంగానీ నాకు లేదు. అవి నిజాలయినా, అబద్ధాలయినా నాకు ఇబ్బందిలేదు. ఏది ఏమైనా ఒక విషయంమట్టుకు నిజం. ఆ అమ్మాయి చాలా అందమైనది.'

ఆడది! పైగా అందమైన–! ఒక విషయాన్ని చెబుతో మధ్యలో పరధ్యానంలోపట్టం నరసింహారావుగారికి కొత్తగాదు. నేనూ ఆయనా పాత స్నేహితుల మవడంచేత ఆయనగారి యీ అలవాటు అధ్వాన్నంగా ఉందనీ అన లేను. బ్రహ్మచారి నవడంమూలంగా ఇటువంటి విషయాల్లో నిదానం సహజంగా తక్కువ. అంచాత అడిగాను.

'ఎవరా అమ్మాయి?'

'ఉందిలే, స్కూలు టీచరు. ఈ ఊరు యువక లోకానికి ఆరాధ్యదేవత. చాలా అపకీర్తిలో బ్రతుకుతోంది. ఫ్రాన్సులో పుడితే ఈ పాటికి ఇండియా వ్యాపించును ఆవిడకీర్తి!'

నరసింహారావుగారి ధోరణి నాకు నచ్చలేదు. చప్పగాఉంది. ఎవరికయినా ఒక యువతితాలూకు తెరవెనుక సన్నివేశాలూ, గోడమీది రాతల్లో అంతరార్థం– ఇవి కావాలిగాని వ్యాఖ్యానాలు సరిపడవు. అంచాత పదార్థ విజ్ఞాన శాస్త్రవేత్తవలె ఆమె ఉనికీ, ఘనపరిమాణం ఇత్యాది ఆరా తీశాను.

'ఆమె ఉంటోందెక్కడా? పేరేమిటీ? అస లెవరూ?'

'ఇక్కడే ఆలయం వీధిలో ఉంటున్నారు. పేరురాధ. అసలు వాళ్ళది–వరం. ఆఊర్లో స్వంత ఇల్లుకూడఉంది. బ్రతికున్న రోజుల్లో తండ్రి ఈ చుట్టుపట్ల పురాణం చెప్పడంలో పేరు మోశాడు. నారాయణ శాస్త్రులని—వినే ఉంటావు.'

రాధ. నారాయణశాస్త్రులుగారి అమ్మాయి. —వరం.

చదివేసిన పుటలు వెనక్కి గిరగిరా తిరిగాయి. ఒకానొక అధ్యాయం మొదట్లోఆగి, మనసు దేనినో గుర్తుపడుతోంది.

'ఆఁ ! గుర్తొచ్చింది !'

'ఏమిటీ ?'

'రాధని నే నెరుగుదును.'

* * *

రాధను నేను బాగా ఎరుగుదును. నా చిన్నప్పుడు మా నాన్నగారికి ఆపూరు బదిలీ అయినపుడు, మేము వారింటిపక్క యింట్లోనే ఉండే

వారం. రాధతండ్రి నారాయణశాస్త్రిలు పురాణం చెప్పేవాడు. తల్లి విశాలాక్షమ్మగారు, చాలా మంచిది. మాకు కోతికథా, కొంగకథా చెప్పేది.

శాస్త్రిగారికి వయసు మళ్లేకనే రాధ పుట్టింది. పిల్లలుపుట్టేందుకూ, గిట్టేందుకూ మానవప్రజ్ఞ ఏమీ లేదనీ—అంతా భగవదనుగ్రహమేననీ ఆయన సిద్ధాంతం. రాధను దేవుడే ప్రసాదించాడని ఆయన అందరికీ గర్వంగా చెప్పుకొనేవాడు. కొందరు గిట్టనివారు రాధ జననం గురించి అనేక స్థలపురాణాలు చెపుతారు.

ఒక్కగాను ఒక్క కూతురేమో, రాధను మల్లెమొగ్గలా పెంచారు. జోలపాటల్లో, ముద్దుల్లో పెద్దదయింది రాధ. పూలపావడా వేసుకొని రాధ ఆయింటికీ ఈయింటికీ గెంతుకొంటూ వెళ్ళి, ఈ పాపతో, ఆ బాబుతో ఆటల్లో పాడుకొంటూ పాటల్లో ఆడుకొంటూవుంటే సీతాకోకచిలక తలపుకొచ్చేది. పొద్దు పొడవకండా లేచి, పెరట్లో పువ్వులన్నీకోసి వీధి అంతా పంచిపెట్టేది. అమ్మ మీదా, నాన్నమీదా అలిగి, పెరట్లోని జామిచెట్టెక్కి, చిటారు కొమ్మల్లో కూనిరాగాలు తీస్తూ కూచొనేది. ఆ ముసిలాడు పేరుపేరునా పిలిచి మిఠాయీ, మల్లెమొగ్గలూ కొనిస్తానని బులిపించి దింపుకొనేవాడు. చిన్నపుడు రాధని అందరూ చందనపుబొమ్మ అనేవారు.

ఇలా ముద్దుల్లో, ముచ్చటల్లో చాలారోజులు జరిగిపొయ్యాయి. రాధ అప్పుడప్పుడు పావడాకు పైట తగిలిస్తుండేది. గెంతడం, చెట్లెక్కడం మానేసింది. మర్యాదగా, మధ్యాహ్నంమాత్రం ఇరుగు పొరుగులకు వచ్చిపోతుండేది. కాళ్లలో అస్తమించిన నృత్యం కళ్ళలో ఉదయించింది. రాధ నేత్రాలు ఎన్నో స్వప్నాల్ని ప్రతిఫలించేవి.

వెళ్ళినచోటల్లా రాధకు తన పెళ్లిప్రసక్తి ఎదురయేది. ఈడొచ్చిన పిల్లని అట్టేపెట్టుకోడం శాస్త్రిగారికి తగదని ఆమెముందే విచారం వెలిబుచ్చేవారు. రానురాను రాధ మీద అందరికీ అనురాగం తగ్గింది. రాధకూడా ఎవరింటికీ వెళ్ళడం మానింది; తరచు కనపడేదేకాదు.

హఠాత్తుగా ఒకనాడు శాస్త్రిగారి అమ్మాయి వెళ్ళని అందరూ అనుకొన్నారు. వరుడు గోదావరికి అవతలి మనిషి. కీర్తిగలవంశానికి చెందినవాడు. భూమీపుట్రా ఉన్నవాడు. పైగా చదువులేకపోయినా మంచి తెలివయిన ఘటమట. ఇక ఇన్నింట ఘనుడయ్యాక అతని రూపురేఖల ప్రసక్తే లేకపోయింది ఎవరికీ. సంసారం చేసుకొనేవారికి అందంతో పనేముంది! అందరూ రాధ అదృష్టవంతురాలనుకొన్నారు.

అన్ని హంగులతోనూ, సర్వకలాపాలతోనూ పెళ్లి వేదయుక్తంగా జరిగిపోయింది. తరవాత ఆ విషయం ఎవరూ పట్టించుకోలేదు.

చాలారోజులు గడిచిపొయ్యాక, ఒకరోజు వీధిఅంతా విడ్డూరంగా చెప్పుకొన్నారు.

కార్యంనాటిరాత్రి భార్యాభర్తల్ని గదిలో దిగవిడిచి, తలుపులుబిగించి కిలకిలా నవ్వేరట పేరంటాళ్లు. మర్నాడు తెల్లారకముందే బయటకొచ్చి తల్లిఒడిలోపడి ఒకటే ఏడుపట పెళ్ళికూతురు. క్రమంగా అందరూ విషయాన్ని శాంతంగా తెలిసికొన్నారు. ఉదయాన్నే ఈ అలికిడి ఆలకించినవాడై, కండువా భుజాన్ని వేసుకొని, ఆ భర్త ఎవరికీ చెప్పా చెయ్యకండా స్వగ్రామం చేరుకొని అక్కణ్నించి నిష్ఠూరంగా ఉత్తరం జారీచేశాడట—వెంటనే భార్యను పంపమని.

అతను రానూలేదు-ఈమె వెళ్ళనూలేదు. మా నాన్నగారికి బదిలీ అయిపోడంతో తరవాత ఏం జరిగిందీ తెలియలేదు.

* * *

'తరవాత చాలా జరిగింది—నీ అందాలబరిణె రాధ ఇప్పుడు నిజానికి పాండురాజస్నుష' అన్నారు నరసింహారావుగారు.

ఆయన ఇందాకణ్నించి ఒక మాటయినా మాట్లాడలేదు. కనీసం నావైపు చూడనన్నా చూడలేదు. సిగరెట్ కాల్చడం వినా మరొక పనైనా చేయకండా శ్రద్ధగా వింటున్నారు.

'అంటే ?'

'ఆ అమ్మాయి అంతఅందమయింది కాకపోతే, నాకీ విషయాలన్నీ తెలిసిఉండేవేకావు. ఆమె కనుసన్నల్లో ఇప్పుడు పంచపాండవు లున్నారు. కర్ణాది మహావీరులు ఇంకెందరో అనుకో. పేర్లు కూడా తెలుసు నాకు.'

'ఎవరు బాబూ ఆ మహానుభావులు ?'

'మహానుభావులే! చేటవెయ్యగాళ్లు. వాళ్ళ మొఖాలుచూస్తే అంతా అబద్ధం అనిపిస్తుంది

మూర్తి, బాపినీడు, శ్యామలరావు, సుదర్శనం— ఆఖరువాడు ఇన్స్పెక్టరు. వాడికీ ఏదో పేరుండాలి మరి.'

నరసింహారావుగారు ఎందుకో కొద్దిగా చికాకు పడ్డారు. కాసేపు నిశ్శబ్దంగా ఉండి ఈసారి నా ముఖంలోకి నిదానంగా చూస్తూ అడిగారు :

'ఆవిడ తల్లిగార్ని ఎరుగుదువన్నావు గదూ ?'

'ఎరగడమేమిటి ! చిన్నప్పుడు ఆమెచుట్టూ చేరేవాళ్ళం కథలు చెప్పమని. మంచి మనిషి. పిల్లలంటే చాలా ప్రేమ.'

'ఇక నేం ! కోటలో పాగా వేశావన్నమాట.'

* * *

ఆలయం వీధిలో కుడివైపు, అటునించి ఆరో ఇంట్లో పంతులమ్మగారు కాపరం ఉంటున్నారు. ఆ ఊరిలో ఎవరి నడిగినా ఈ భోగట్టా తెలుస్తుంది. దూరంనించే ఆ ఇల్లు ప్రత్యేకంగా కనపడతోంటుంది. వీధిగోడలు సయితం ఎప్పుడూ తెల్లగానే ఉంటాయి. గుమ్మంలో చెత్త ఉండదు. గుమ్మానికీ, కిటికీలకీ ఊదారంగు తెరలు కట్టి ఉంటాయి. పగలంతా నిశ్శబ్దంగా ఉంటుంది. రాత్రిపూట ఫిడేలు సంగీతం వినపడుతుంది.


సావిడిలో విశాలాక్షమ్మగారు ఒక్కరూ కూచొని పత్రిక చదువుకొంటున్నారు. ఆమె కళ్ళకు జోళ్ళున్నాయి. ఒక్కక్షణంసేపు నిదానంగా చూసి గుర్తు పట్టేశారు.

'ఆహా! రావయ్యా-చాలా పెద్దవాడివయ్యావే-అమ్మా, అక్కయ్యా అంతా క్షేమమా?'

అంటూ ఎంతో ఆప్యాయంగా అడిగారు. సాధారణంగా అటువంటి సన్నివేశంలో చేయాల్సిన మర్యాదలన్నీ చేశారు.

గదిఅంతా అప్పుడే సర్దినట్లుచాలానీటుగాఉంది. గదిమధ్య ముఖమలుగుడ్డ పరిచిన చిన్న టేబిలు మీద పూలకుండ ఉంది. దానిలో కాగితపు పూలు ఉన్నాయి. గదికి నైరుతిలో ఒకటేబిలూ రెండు కుర్చీలూ ఉన్నాయి. టేబిలుమీద పుస్తకాలూ, ఒక హార్మోనియమ్‌పెట్టే ఉన్నాయి. టేబిలు నానుకొన్న గోడకు వయొలిన్ కేసు వేలాడుతోంది. గదికి కుడివైపున ఒక పడకకుర్చీ ఉంది. అందులోనే విశాలాక్షమ్మగారు కూచున్నారు. గదికి వాయువ్యమూలలో తివాసీచుట్ట జారవేసి ఉంది. తివాసీ దగ్గిరగా రెండు ట్రంకుపెట్టెలు ఒక దానిమీద మరొకటిగా ఉన్నాయి. నేను టేబిలు దగ్గిరకున్న రెండు కుర్చీలలో ఒకదానిమీద కూర్చొన్నాను.

విశాలాక్షమ్మగారు చాలా చెప్పారు. చాలా అడిగారు. రాధమీద అపవాదులగురించీ, తమ



భర్త మరణంగురించీ విషాదం వెళ్ళబుచ్చారు. రోజులు మంచివికావని నిట్టూర్పు విడిచారు. అదంతా తాము చేసుకొన్న ఖర్మమని ఓదార్చుకొన్నారు.

సావిడిలోంచి దొడ్లో చామంతిమొక్కలు కనబడుతున్నాయి. విరగపూసిన ఆమొక్కలమీద లేతఎండ పడుతోంది. దొడ్లోంచి సన్నగా ఎంకి పాట వినపడుతోంది. రాగం మొదలయింది. సన్నగా, రాగం నెమ్మదిగా నడుస్తూ గుమ్మంలో ఆగింది. మెరుపు మెరసినట్లయింది. ఎంత మారి పోయింది రాధ! నరసింహారావుగారు ఎందుకు చికాకుపడిందీ నాకు అర్థమయింది. కళ్లుండి చూడ గలిగిన ఎవరికైనా రాధ కళ్ళలోని వెలుగు కనుపడి తీరుతుంది. ఆ నడకతీరులో గాలిలో తేలే పక్షి కనపడుతుంది. ఎంతకాంతి అయినా ఆమె నీడను కల్పించలేదు. రాధ రూపందాల్చిన యౌవన క్రాంతి.

ఆశ్చర్యం! రాధ నన్ను మర్చిపోలేదు. చిన్న పుడు శివాలయంలో ఆడుకొనేవాళ్ళం. రాధ సీత; నేను హనుమంతుణ్ని; ఆలయంలో మండపం లంక; ఎందరో రాక్షసులు; మరెందరో వానరులు; చీపురు పుల్లలు మాకత్తులు; చీకిపోయిన చేంతాడుముక్కలు మా తోకలు—రాధకు ఇవన్నీ ఇంకా జ్ఞాపకం ఉన్నాయి.

చిన్ననాటి ముచ్చట్లు ఎంతసేపో మాట్లాడు కొన్నాం—మాటమాటకీ మధ్య నవ్వుకొన్నాం. కాసేపటికే ఎంతో పరిచయమయిపోయింది. ప్రవా హంగా మాట్లాడుతోంది, ఉప్పెనగా నవ్వుతో.

ఆవిడేనా అంతసేపూ మాట్లాడ్డం. నేనుమాత్రం మాట్లాడొద్దూ?

'సంగీతం మీకు చాలా ఇష్టం కదూ?'

'కాదు.'

'అబద్ధం- మీరు పాడుతుండగా విన్నాను'

'ఇష్టంలేని పనులు చేయకండా ఉండడానికి అందరికీ సదుపాయం ఉంటే - లోకంలో ఒక్క పనీ జరగదు. ఆవలిస్తూ అందరూ ఈగల్ని తోలు కొంటూ కూచొంటారు.'

'పుస్తకాల్లోమాటలుబాగా ముక్కునిపట్టాయే!' అన్నా, నా మాటల్లో వ్యంగ్యానికి మురిసిపోతూ. స్త్రీనించి ఏ చిన్నదయినా వరం కోరే ఏ మొగా డయినా అలా మాట్లాడడు.

'వెయ్యి సంవత్సరాలకిందే విన్నా ఈమాటలు. ఎంత మంచివారు మొగాళ్లు! మమ్మల్ని చిలకలగా చేసి పంజరాల్లో దాచుకొన్నారు. చెట్టు కొమ్మల్లో పక్షులుపాడితే కోపం రాదూ? ఏదో విధంగా కసి తీర్చుకోకండా ఉండగలరా?'

ఆడది తెలివితేటలగా మాట్లాడితే నిజంగా కోపం వస్తుంది. స్త్రీలని మనం ఉత్త ఆడవాళ్ళగా చూస్తాం; పురుషుల్ని వారు ఉత్త మొగవాళ్ళగా చూడరు. పాతివ్రత్యం, సహగమనం పథ్యంలో కయినా ఉపయోగపడకండాపోయాయి. అందుకు మాకు విచారంలేదు, వాలుచూపులూ, నిట్టూర్పులూ, కన్నీళ్లూ - సందుల్లో చలనం, కీ నీడలో సంభాష ణలూ—ఇవీ పోయాయి! చక్కని ఉంగరాల తలని వెనక్కి విరగ దువ్వడం, నడుం దగ్గిర చీరని కచ్చేలా బిగించడం, భుజాని కొక సంచి తగిలించు కొని వస్తాదుల్లా వీధిలో తిరగడం! వీరినిచూస్తే దేశంలో మిగిలిన శృంగారం కాస్తా హరించుకు పోతుంది. వేదికమీద ఉపన్యాసాలు, చేతిలో పుస్తకాలూ; కాస్త ఇంగ్లీషు చదువుకొన్నవాళ్లు మరీని—మాట్లాడితే ప్రతిదానికీ 'నా అభిప్రా యంలో' అంటూ మొదలెడతారు. అభిప్రాయ మొకటీ వీళ్ళకి!

నా సాంఘిక పాండిత్యానికి ఈమె లొంగేట్టు లేదు. నాకు చక్కని రాజకీయ పరిజ్ఞానంఉంది. సంభాషణ మార్చాను.

'మన దేశానికి స్వతంత్రం వచ్చిందని నమ్ము తారా?'

'దేశం— స్వాతంత్ర్యం— నమ్మకం. అబ్బ! ఆమాటలే తలదిమ్ముగా ఉంటాయి. ఇటువంటి మాటలువింటే, నాకు, తాలూకాఆఫీసు జ్ఞాపకం వస్తుంది. నాభర్త నామీద కేసు పెట్టాడు. వాయిదావాయిదాకు అక్కడికివెళ్లి—ఆగాలి పీల్చ లేక, నాదేతప్పని ఒప్పుకోవాలనిపించేది. మీకు తెలుసనుకొంటా—ఆ కథంతా.'

'అంతేకాదు—ఇంకా తెలుసు.'

అసలే మనసు చురచురలాడుతోంది.కోపందాచ డానికిప్రయత్నించడంలో, ఈమాటలుఅసహ్యంగా ధ్వనిచేసుకొంటూ బయటపడ్డాయి. కరుకుగా మాట్లాడినందుకు నాకే బాధకలిగింది.

రాధ పుస్తకంతీసి పేజీలు తిరగేస్తోంది. మధ్య మధ్య ఒకటిరెండు పంక్తులమీద దృష్టి నిలుపు

తోంది. నిశ్శబ్దం భరింపరానిదిగా ఉంది. శబ్దం చేయడానికి భయంగాఉంది. నిశ్శబ్దంలో విశ్వగానం వినగలగడం ఏ మహాకవికోగానిచాతగాదు ! దానికెంతో సాధన కావాలి. రాధ నిశ్శబ్దంగా చూస్తోంది. ముఖంలో వెలుగునీడలు లేవు. అక్కడ కూచోడం బాధగాఉంది. వెళ్ళలేను. క్షమించమని అడగాలనుకొంటూ—చేసినతప్పు తెలియదు. ఆఖరికి అడిగాను—వీలయినంత సరళంగా కంఠం సవరించి.

'మిమ్మల్నొకప్రశ్న అడుగుతా — జవాబు చెబుతారా?'

రాధ చూసింది. నిశ్చలమైన సరస్సులో ప్రతిఫలించిన రెండు నక్షత్రాలవలె ఉన్నాయి ఆమెకళ్ళు. ఆమె మాట్లాడలేదు. అడగవలసిన ప్రశ్నలకి ఉపోద్ఘాతం ప్రకటించేశాను-ఇక ఉపసంహారణకి దారిలేదు. ఇటువంటి సమయంలోనే మనిషి తెలిసీ తప్పుచేస్తాడు-తప్పుచేసి నిర్లక్ష్యంగా తనకి లెక్కలేదంటాడు. దూరంగా వెళ్ళిపోయి చీకట్లో కళ్ళు మొత్తుకొంటాడు. ఐతే నేను శక్తిగల మనిషినికాను.

నాప్రశ్నలు బతిమాలడంవలె ఉన్నాయి.

'బాపినీడట-ఎవరు?'

'మేష్టరు.'

నాలుగుమూళ్లెంతాఅని రెండోక్లాసుకుర్రాడు సగం తెలియకా సగంతలతిక్కగా ఆరోక్లాసు అబ్బాయి నడిగితే రాధలానే జవాబిస్తాడు 'పదమూడు' అని.

'మూర్తట-ఆయనెవరూ?'

'నారాయణమూర్తి'

'శ్యామలరావు?'

'అతనికేమీరావు-అన్నీ వొచ్చంటాడు.'

'సుదర్శనం?'

'అతన్ని నేను మూర్ఖుడంటాను- అమ్మ మంచివాడంటుంది.'

'ఇనెస్పెక్టరు?'

రాధ కోపంగా, దయగా చూసింది.

'జాబితాకోసం ఎంత పరిశోధన జరిపారో కదా! చిన్నప్పట్నుంచీ ఎరుగుదురే-అడిగితే నేనే చెప్పలేకపోయానా!'

రాధకళ్ళు కొద్దిగా చెమ్మగిల్లాయి-పెదవులమీద చిరునవ్వు చిన్న కెరటంవలె పాకింది. చిన్నప్పుడు పూలపావడాలోరాధ బొమ్మలపెళ్లికి మమ్మల్ని పిలిచింది; పెళ్లిభోజనాలు! జామాతుల్లో పంచదార పలుకులువడ్డిస్తోందిరాధ. ఆక్షణంలోరాధ ఎవరో కాదనిపించింది. అప్రయత్నంగా అడిగేశాను అమాయకంగా.

' రాధా - అయితే - నేనెవరు ? '

రాధా అని సంబోధించానేగాని ఈ ప్రశ్న నన్నే వేసుకొన్నానేమో ! రాధ నవ్వింది.

' మిమ్మల్నే ఎరగరా ? ఒక పనిలేని మంగలి.' రాధ ఉప్పెనగా నవ్వింది. నేనూ నవ్వేను ; నా నవ్వులో సిగ్గూ పశ్చాత్తాపం ఉన్నాయి.

* * *

నరసింహారావుగారికి ఇదంతాచెప్పాను. ఆయన అన్నారు:

' సుఖించి సుఖపెట్టగలవారు సహితం బాధించి బాధపడతారు. '


దిఇండియన్ బ్యాంక్
లిమిటెడ్
హెడ్డాఫీసు : మదరాసు
(Estd: 1907)

జారీచేసి చందావేయబడిన
మూలధనం రూ. 72,00,000
అడిగిన మూలధనము. రూ. 53,00,000
రిజర్వ్ ఫండ్ రూ. 62,00,000
అన్నిరకాల బ్యాంకింగ్ వ్యవహారాలు చేయబడును.
యన్. గోపాల అయ్యర్,
కార్యదర్శి.